

# టేకిట్ ఈజీ!!

## శ్రీనివాస ఫణికుమార్ డొక్కా



నెలకో ఎపిసోడ్ రెడీ..జీ..

ఎవరేమన్నా..ఏదేమైనా టేకిట్ ఈజీ..!

## గంధర్వ కోకిల

శీర్షిక చదవంగానే, కాలిందా ? అరికాలిమంట అబ్లాంగేటాకి ఎక్కిందా ?

ఉంటే "వసంత కోకిల " అనుండాలి, చక్కగా శ్రీదేవిలా పెద్ద జెడ, పెద్ద కళ్ళు, ముద్దు ముద్దుగా బావుండేది. లేకపోతే "గంధర్వ కన్య" అనుండాలి, ఎంచక్కగా జయమాలినిలా.... (డీటెయిల్సు ఎందుకులెండి), బావుండేది. అంతే గానీ, **గంధర్వ కోకిలేవిటి** ? నీ.. అనుకుంటున్నారా ? ఐ.నో. కానీ మీరు నన్నేమీ చెయ్యలేరు, ఎంచేతనంటే నేను మీ చేతికీ, కాలుకీ, కారుకీ అందనంత దూరంలో ఉన్నానని నా విశ్వాసం. కానీ ఆ శ్రీధర్ గాడు, సరిగ్గా రెండంటే, రెండే ఇళ్ళ అవతలుంటాడు, గెట్టిగా తుమ్మితే వాడికి వినిపిస్తుంది. వినంగానే, ఆ వంకన పరిగెత్తుకొచ్చేస్తాడు, వస్తూ వస్తూ ఓ కాయితం పట్టుకొస్తాడు, వస్తాడేవిటి, వచ్చేసాడు. వచ్చి, ఇదిగో ఈ **గంధర్వ కోకిల** చదివి వినిపించేసాడు. ఆ రాహుకాలం గడిచి, ఇప్పటికి రెండుగంటలయ్యింది. నేనింకా తేరుకోవడానికి కాస్త సమయం పట్టచ్చు. వాడి మాటలు ఇప్పటికీ నా బుర్రలో ప్రదక్షిణలు చేస్తున్నాయి...

" కోకిల కూస్తే వసంతకాలం,
తీతువు కూస్తే పొయ్యేకాలం *(నీ మన్నూ మశానం..)*
ఒక్కొక్క కాలానికో కూత,
ఒక్కొక్క కలానికో రాత.."

ఇప్పుడర్థవయ్యిందా ?

***ఎవడు కవిత చదివితే దిమ్మ తిరిగిపోయి, మైండు బ్లాంకయిపోయి, జీవితేచ్ఛ నశిస్తుందో....వాడే శ్రీధర్ గాడు.***

అందరు కవుల్లాగే వాడికీ ఓ దుర్గుణముంది. ప్రతీ ముక్కా కనీసం రెండుసార్లు చదువుతాడు. మొహమాటానికి "బావుంది" అంటే, ఇంకో రెండుసార్లు చదువుతాడు, బాగోలేదన్నా చదువుతాడు, వాడి కవి హృదయం వివరిస్తూ. ఒక్కసారి చదివితేనే మీ పరిస్థితి

ఎలావుందో నేనర్థం చేసుకోగాలేనిది, నేను మరి రెండుసార్లు, కాదు, నాలుగు సార్లు విన్నాను, ఆ మాత్రం అర్థంచేసుకోలేరూ, జాలీ అంతఃకరణాలేవూ ? అది గుండా రాయా?

అయినా మిమ్మల్నని ఏం లాభం లెండి. *"చేసుకున్న బ్రామ్మడా, అనుభవించూ"* అని ఊరికే అన్నారా? ఇదంతా నా సాయంకృతం. ఇప్పటికి సరిగ్గా మూడువందల అరవై ఐదు రోజుల మూడుగంటల ముప్ఫై నిముషాల మూడు సెకన్ల క్రితం....నా జాతకంలో ఏలినాటి శని మొదలైన ఘడియల్లో, మా సబ్ డివిజన్‌లో కొత్తగా ఇల్లుకొనుక్కున్న శ్రీధర్ అండ్ ఫామిలీని డిన్నరుకి పిలిచాం, సాటి తెలుగువాళ్ళన్న అభిమానంతో. ఆవిడ చేతిలో పూలకుండీతో, పక్కనే పిల్లలతో ఎంటరయ్యింది. వెనకాల అతను ఒక జోలెసంచీ వేసుకుని, చిరుమందహాసంతో ఎంట్రీ ఇచ్చాడు. ఆ సంచీలో ఏవుందా అని ఆలోచించి, బహుశా పిల్లలకి ఏ పిక్షనరీయో తెచ్చుంటాడు, భోయనాలయ్యాకా, వెళ్ళేటప్పుడు ఇస్తాడేమో అనుకున్నాను. భోయనాలయ్యాయి. ఆవిడ, పిల్లలూ లేచారు **"వెళ్ళొస్తావండీ"** అంటూ. అతను వాళ్ళకి సెండాఫిచ్చేసాడు **"కాసేపయ్యాకా వస్తా"** అంటూ.

కాసేపయ్యింది. అతను వెళ్ళలేదు. ఇంకాసేపయ్యింది. మా ఆవిడ పిల్లల్నేసుకుని పైకెళ్ళిపోయింది (మేడ మీకి). ఇంకనేను మిగిలిపోయాను తొల్నాటి వధువులా. ఏం మాట్లాడాలో తోచక, టీవీ ఆన్ చెయ్యబోతుంటే ఆగమన్నట్టు సైగ చేస్తూ అడిగాడు " మీ ఫైర్ ప్లేసు పనిచేస్తుందా?". అతని మొహం దూరదర్శన్ వారి కుటుంబనియంత్రణ ఆపరేషను ఎడ్వర్టయిజుమెంట్లో "అది చేయించుకుంటే ఆ శక్తి తగ్గిపోతుందిట కదా?" అంటూన్న గోకిన రామారావు మొహంలా,
ఆందోళనగా వుంది.

"పనిచేస్తుందండీ, ఇల్లుకొన్నప్పుడు మా రియాల్టరు చూపించారు, తరవాత మేము ఇప్పటిదాకా వాడలేదు, ఆ దిక్కుమాలిన కీ ఎక్కడో పెట్టేసాను, వెతకాలి" అన్నాను గబగబా.

"వెతుకుతారా" అన్నాడు గంభీరంగా.

"ఇప్పటికిప్పుడంటే కష్టం గానీ, మళ్ళీ ఈ సారి మీరొచ్చినప్పుడు వెతికిపెడతాను, అయినా అర్జెంటేమీ లేదుగా.. " అన్నాను బుజ్జగింపుగా.

"మీకు లేదు, నాకు అర్జెంటే, అర్జెంటుగా ఈ డైరీని కాల్చేయాలి" అన్నాడు జోలె సంచీలోంచి ఒక పేద్ద డైరీ బయటకి తీస్తూ.

"అదేవిటీ, మీ చీకటి రహస్యాలా" అన్నాను నవ్వుతూ. అతను నవ్వలేదు.

"కాదు, వెలుగు చూడని నా కవితలు" అన్నాడు భారంగా.

మేటరర్థవయ్యింది. వెంటనే అతని పక్కన కూర్చుని, భుజమ్మీద చెయ్యివేసి, పూర్వకాలంలో, ఇలాగే ఒక మహా కవి తను రాసిన కవిత్వాన్ని హోమగుండంలో పడేసిన సంగతీ, తద్వారా మనం ఎన్నో మంచి గ్రంథాలనీ, సాహితీ సంపదనీ కోల్పోయిన సంగతీ చెప్పి, అదే దూరదర్శన్ వారి ఎడ్వర్టైజుమెంటులో సుబ్బరాయ శర్మలా అతన్ని ఉత్సాహపరిచే ప్రయత్నం చేసాను **"హుషార్, హుషార్"** అంటూ. అదీకాక నేను తెలుగుభాషని ఉద్ధరించేందుకు కట్టుకున్న కంకణం, వాచిన నా చెయ్యి, చూపించి, "నేను మూణ్ణెల్లకోమాటొచ్చే ఓ పత్రిక నడుపుతాను, దానిలో మీ కవిత తప్పకుండా వేసుకుంటాను.." అని భీషణ ప్రతిజ్ఞ చేసేసాను. పైనించి దేవతలు పూల వర్షం కురిపించలేదు కానీ కరెంటు పీకేసారు. మా ఇంట్లో కొవ్వొత్తులు లేవని నిర్ధారించుకున్న మీదట అతను కాళ్ళీడ్చుకుంటూ వెళ్ళిపోయాడు.

మళ్ళా శనివారం రాత్రి నాకు మూడింది. అమృతంకురిసిన రాత్రి అందరూ పడుకున్నారుట, నేనూ పడుకునుంటే పోయేది, నా ఖర్మకాలి మేలుకున్నాను. ఆ రోజు కవిత్వం వడగళ్ళుగా కురిసింది , నా రూఫు డేమేజి అయిపోయింది . టాపు లేచిపోయింది . మీరు నమ్మండి నమ్మకపోండి, ఇదీ అతను చదివిన మొదటి కవిత, సంక్రాంతి పండగ మీదట..

" సంక్రాంతంటే ఏవిటి? సంక్రాంతంటే పండగ !!
ఆ రోజు పొద్దున్నేలేస్తాం, పొంగలి తింటాం
మధ్యాన్నం పడుకుంటాం, లేచాకా బూర్లు తింటాం,
రాత్రయ్యాకా పేకాడుకుంటాం, నిద్దరొస్తే మిడిల్ డ్రాపు చేసి పడుకుంటాం.."

ఇలాగే *భోగి, కనుమ, ముక్కనుమ, ముక్కోటేకాశి, మిలాదున్నబీ, డొల్ల కర్తరి (?), సుబ్రహ్మణ్య షష్ఠి, జగ్గంతోట ప్రభల తీర్థం, గోకులాష్టమి, అట్లతద్ది, క్రిష్టమసు, మహావీర్ జయంతి, భగినీ హస్త భోజనం, పోలాలమావాస్య..*

ఇల్లా ఒకటేవిటి, కేలండర్ లో వున్న ప్రతీ ఎంట్రీ మీదా అతను కవిత రాసేసాడు. ఆ సెక్షను పేరు **"పండుగ - దినాలు"**. ఆ విభాగంలోంచి కొన్ని ఆణిముత్యాలు వదిలేసరికి, అర్థరాత్రయ్యింది. నాకు మెల్లిగా వణుకు మొదలైంది. కాసేపు ఆవులించాను, వెళిపోతాడేమో అన్న ఆశతో. అతను టీ పెట్టిచ్చాడు మాయింట్లో, నాకు.

తరువాతి విభాగం హైకూలట. మీరొద్దన్నా వినాల్సిందే, ఏం నేనొఖ్ఖణ్ణే అనుభవించాలా? తిలాపాపం తలాపిడికెడూ. ఒక హైకూ వజ్రం

*" చంద్రుడిలో చంద్రుడు*
*స్టీలు కంచంలో సగ్గుబియ్యం వడియం.."*

ఇల్లా నాకో వజ్రాలహారాన్ని సమర్పించాడు. టైము రెండు. దెయ్యాలు సెకండ్ షోనించి వచ్చే వేళ. అయినా అతను కరుణించలేదు. మళ్ళా కరెంటుపోతే బావుండని ఎంతగా ఎదురుచూసానో పిచ్చి ఆశతో. అయినా, ఏ జన్మలో చేసిన పాపం ఆ జన్మలోనే అనుభవించాల్సి ఉందని రాసిపెట్టివుంది గామాల్సు నా జాతకంలో. అందుకే కరెంటుపోలేదు, కనీసం నా ప్రాణంకూడా పోలేదు. పోతనగారన్నట్టు *"నాభాగ్యమెట్టున్నదో..".*

ఉన్నట్టుండి నామొర ఏదేవుడో ఆలకించినట్టున్నాడు. అతనన్నాడు

"ఇంక నేను పడుకుంటానండీ, ఓ దుప్పటీ ఇస్తారా". నా చెవులని నేనే నమ్మలేకపోయాను.

"ఇంటికి వెళ్ళరా?" అడిగాను హుషారుగా.

"లేదండీ, నేను రాత్రిపూట డ్రైవింగు చెయ్యను..".

నాకర్థంకాలేదు. అతను నడిచొచ్చాడు మాయింటికి. అయినా ఎందుకులే కదపడం అని, ఓ దుప్పటీ తెచ్చిచ్చాను అమితానందంగా. అతను సోఫాలోనే పడుకుంటూ ఫినిషింగ్ టచ్చిచ్చాడు

" మీరు మాత్రం ఇవాళ రాత్రి ఈ డైరీ చదవాల్సిందే, ఇంకా చాలా సెక్షన్లున్నాయి, ఎర్రచీమలు, కండచీమలు, గొల్లభామలు, వానపాములు, మగపురుగులు.. . రేప్పొద్దున్న లోపల అన్నీ ఓమాటైనా చదవకపోతే, మీ పిల్లల మీదొట్టే.." .

ఆ దుర్మార్గుడు పడుకున్నాడు. నేను విధిలేక, నిద్రకూడా ఎగిరిపోవడంచేత, పేజీలు తిరగేసాను. వాటిలో ఎన్నో వింతలు. ఒకలైనువి, రెండులైన్లవి, నాలుగు లైన్లవి.., సగంలో వదిలేసినవి. వాటినిచూస్తే వాల్మీకిగారు లంకలో రాక్షసులగురించి చేసిన వర్ణనలు గుర్తొచ్చాయి, పేద్ద నోరువాడు, గాడిద చెవులవాడు, ఒంటికొమ్మువాడు అంటూ.. కానీ ఏంచేస్తాం, చదవకపోతే పిల్లల ప్రాణాలమీదకొస్తుందేమోనని, చదివాను. కొన్ని పేజీల్లో కవిత పేరే తప్ప కింద మేటర్ లేదు. *"మూడు చుక్కలు"* అనే కవిత పేరు కింద అక్షరాలా మూడు చుక్కలున్నాయి, అంతే... *" విరామం "* అనే కవితకింద ఒక కామా గుర్తు, *"ఇంకచాలు"* అనే కవిత కింద ఒకే ఒక్క ఫుల్ స్టాపు గుర్తు. ఇంక నా సహనం చచ్చిపోయింది. పైకెళ్ళి పడుకున్న పిల్లల్ని ఓ మాటు తనివితీరా చూసుకున్నాను ఎందుకేనా మంచిదని. కిందకొచ్చి ఓ మాటు ఆలోచించి ఓ నిర్ణయానికొచ్చాను, వాడి పీకి పిసికేద్దామని. తీరా వాడిదెగ్గిరికెళ్ళేలోపు నాకు కళ్ళుతిరిగినట్టయింది. తరవాతేవైందో గుర్తులేదు. మూడురోజుల తరవాతగానీ నన్ను ఎమర్జెన్సీ వార్డులోంచి వదల్లేదు డాక్టర్లు.

అలా వాడి బాధ తట్టుకోలేక, ప్రతి పత్రికలోనూ వాడి కవితలు వేసుకుంటూ,అయినవాళ్ళందరికీ దూరమై, మా వూళ్ళో మాట్లాడే నాథుడే కరువై, ఏడాది భరించి, ఆనక మాయిల్లు అమ్మకానికిపెట్టా. మా శ్రీధర్ గాడి కీర్తి వాడవాడలా వ్యాపించి ఉండడంచేత, తెలుగువాడెవరూ రాలేదు కొనడానికి. ఇంతలో ఒక చల్లని వార్త చెప్పింది మా ఆ విడ. *శ్రీధర్ గారికి కాలిఫోర్నియాలో ఏదో ఊరికి బదిలీ అయిపోయిందని.* వెంఠనే, ఎప్పుడూలేనిది మా
ఆవిణ్ణి ఎత్తుకుని ముద్దెట్టేసుకుని, ఇంటిముందు *ఫర్ సేల్* బోర్డు తీసేసా ఆనందంగా.

కేలిఫోర్నియా వాసులారా...*"చెప్పలేదంచనకపోయేరూ.."*

***

తర్వాత పేజీలో
పేద్ద విశేషం..!

" ఏవిటీ,నిజంగానే..."

"ఛా, అయ్యుండదులే.."

" వాడిది కాదేమో, ఇంకెవడిదేనా, వాడిపేరుతోనేమో.."

" వాడి బద్ధకానికి తోడు పుత్తకం రాయడవొహటీ.."

" అబ్బోహో, రాసాడండీ, మహా.. "

కాబట్టి, విషయవేవిటంటే, రెండేళ్ళ ప్రయత్నం ఫలించింది. నా నిశ్చయం బద్ధకాన్ని జయించింది. నా కథల పుస్తకం వెలుగు చూసింది మొన్న అక్షయతృతీయ నాడు. మీరు నమ్మరని తెలుసు, అందుకే కవరు పేజీ, వెనక పేజీ ఇక్కడ జత చేస్తున్నాను, ఇది నిఝంగా నిఝం..

పుస్తకాలు ప్రస్తుతం మన నేలమీద ఉన్నాయి. అవి గాల్లోకెగిరి అమెరికా రాంగానే, అడిగినవాడిదే పాపంగా, అందరికీ పంపించాలని ఆశ దోశ అప్పడం వడ.!

మీకెవరికైనా ఈ పుస్తకం చదవాలనే దురుద్దేశ్యం కలిగితే, నాకొక ఈమెయులు పంపించండి.

**ఫణిడొక్కా ఎట్ యాహూ డాట్ కాం.**

జై బోలో రాం రాం...




